# జరుగుతున్నదిదే!

"శశిధర్ !" ఎవరో పిలుస్తున్నారు. నాకూ వినిపించింది. ఎవరబ్బా- ఈ బజారులో తన్ను పిలిచేవాళ్ళు. ఈ వూరు తనకు కొత్త. అందునా పేరుపెట్టి? అవునూ ఆ స్వరంలో పాత పరిచయం ధ్వనిస్తోంది.

"శశిధర్ !" మళ్ళీ అదే- అదే పిలుపు వినబడింది. అరే! ఎవరూ?-రామేశం! అవును, అతనే- లెక్కల మాష్టారబ్బాయి. తనూ, అతనూ కలిసి చదువుకున్నాం కూడాను.

అన్నట్టు మాష్టారికి తనంటే ఎంతిష్టం. దగ్గర కూర్చోబెట్టుకుని లెక్కలు చెబుతుండే వారు. ఆ కళ్ళలో ఎంత ఆర్ద్రత? ఎంత

## ఎస్. వెంకటేశ్వరరావు

ప్రేమ? ఇప్పుడెలా వున్నారో మాష్టారు? "బావున్నావా! ఏవిటంత పరధ్యానంగా వున్నావ్. రెండుసార్లు పిలిచాను. అన్నట్టు యిప్పుడేం చేస్తున్నావ్?"-అతనే అడిగాడు.

"పరధ్యానం ఏమీ లేదు. ఇక్కడే వున్నాను ప్రస్తుతం. ఉద్యోగప్రయత్నంలో వున్నాను. అందుకే హైదరాబాదు వచ్చేశాను. నువ్వేం చేస్తున్నావ్? నాన్నగారు బావున్నారా? ఇంకా సర్వీసున్నదా, రిటైరై పోయారా- ఏవిటి?" అడిగాను.

"నాన్నగారు రిటైరయిపోయారు. పెన్షన్ రాలేదు- సంవత్సరమయినా. నేనూ అదే- ఆ ప్రయత్నంలోనే వున్నాను- ఉద్యోగం! బి. ఏ. చేసి చాలాకాలం అయిందికదా!" ఎటో తెలియని శూన్యంలోకి బొమ్మల్ని చూపుతున్నట్లు వేలుతో చూపిస్తూ గాలిలో గీతలు గీస్తూ అన్నాడు. అతని స్వరంలో విషాదం వుంది. విచారం- నిస్తబ్దత వుంది. నిర్లిప్తత-నిస్సహాయత వుంది.

"అవును రామేశం! ఏవిటోబలే వుంది. జీవితమంతా ఏదో గొప్ప "మిష్టరీ" లా వుంది. ఏం జరుగుతుందో- ఏమవుతుందో తెలీదు. బహుశా జీవితం అంటే అంతే ననుకుంటాను" అన్నాను అప్రయత్నంగా.

నా స్వరంలో అతనికి- విచికిత్స, వైరాగ్యంలాంటి భావాలు వినిపించి వుండ వచ్చు. ఎవ్వరమూ అలా కనిపించనీయ లేదు. అతని కళ్ళెటో చూస్తున్నాయి.

ఆకారం మామూలుగా వుంటి. బట్టలూ సామాన్యంగా వున్నాయి. నేనూ — నేనూ అంతే. నావైపు చూసుకున్నాను. అచ్చం అలాగునే వున్నాను. అతనితో నా ప్రతిబింబం కనబడుతుందేమో. ఆకలి దంచేస్తోంటి.

కాసేపు ఏవో మాటలు మాటాడుకున్నాం. మా మాటలు రాజకీయాలు, హత్యలు, రచయితలు, పత్రికలు యిట్లాంటి విషయాల్లోకి జారాయి. సెకన్లు కదులుతున్నాయి. నిమిషాలు నడుస్తున్నాయి. గంట!

సరిగా గంటయింది. ఏం మాట్లాడాం? జస్ట్ గాసిప్!

> అమెరికాలో, ప్రతి ముగ్గురిలో ఇద్దరు ధర్మరాజులని ఇటీవలి లెక్కలలో తేలింది! 1974 లో అమెరికాలో, ప్రతి ముగ్గురిలో ఇద్దరు జూదంలో పాల్గొన్నారట. ఈ అమెరికన్ ధర్మరాజులందరూ కలిసి ఆ ఒక్క సంవత్సరంలో వాడ్డిన మొత్తం డబ్బు 2240 కోట్ల డాలర్లు!

"సరే, శశిధర్ వెళ్తానుమరి! ఇవ్వాళే మా బావగారింటికి వస్తానని చెప్పాను. మధ్యలో ఏవో వెచ్చాలుకూడా తీసుకోవాలి. మళ్ళీ కలుద్దాం" నేనూ అందుకోసమే చూస్తున్నాను. ఆకలి దంచుతోంది. ఎక్కువసేపు ఆకలి అయినతర్వాత తినకుండా వుంటే "ఆకలి" చచ్చిపోతుందన్నమాట ఒట్టి భ్రమగా నాక్కనపడింది. రామేశంకూడా వెళతానంటున్నాడు.

"ఊఁ అలాగే, మళ్ళీ ఎప్పుడైనా కలుద్దాం. నాక్కూడా కొంచెం పనుంది. మా ఫ్రెండ్ ఒకతను రమ్మన్నాడు. అమ్మకూడా యివ్వాళ త్వరగా రమ్మంది. ఎక్కడికో వెళ్ళాల్ట" ఒక్కగుక్కలో చెప్పాను-ఏదో తోచినది.

రామేశం అటూ-నేనిటూ విడిపోయాం. నా జేబులో వున్న అయిదు పదిపైసలనాణాలు ఘల్లుమన్నాయి. బాగా ఆకలివేస్తోంది. అబ్బ! నడుస్తున్నాను. నాఆత్మ నాతో అంటోంది. ఏదో అంటోంది. చష్ పూరుకొమ్మన్నాను. అయినా నాకే అనిపించింది. "ఎంత ఆత్మవంచన, అంతా తప్పించుకోవడానికే మాట్లాడాను."

ఛ్ఛ్, ఏం చేయగల్ను!

"లేకుంటే ఎలా? వున్నది. యాభై పైసలు-"

హోటల్ వైపు దారి తీశాను.

కుర్చీలాక్కుని కూర్చున్నాను.

కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని గ్లాసు నీళ్ళు తాగి, టేబుల్‌మీద పెట్టబోతూ గ్లాసులోంచి అవతల ముఖం చూశాను.

అదే - స్థూలంగా, కళ్ళు, కాళ్ళు-పళ్ళు-వళ్ళు-కీళ్ళు-మానవాకారమే అయితే అవన్నీ పరిచయమున్నవే అతను-రామేశం!

ఒక్కో పదిపైసలూ లెక్క పెట్టుకుంటున్నాడు. మొత్తం అర్ధరూపాయో, అరవై పైసలో వున్నాయి.

పాపం అతనూ-వాళ్ళ బావగారింటికి వెళ్తున్నాడు. పాపం నేనూ నా ఫ్రెండ్ యింటికి వెళ్తున్నాను. ఎంత దగా! అబ్బ ఎంత మోసం!

అర క్షణంలో మా యిద్దరిమధ్యనున్న తెర తొలగబోతోంది.

అతను నావైపు చూశాడు- చూశాడు- చూశాడు. అక్కడ తుఫానుకు ముందుండే నిస్తబ్దత- నిశ్శబ్దం! ఎక్కడో ఒక "సీమటపాకాయ" గుండె అదిరేట్టు పేలింది.

> ప్రతిరోజు మానవుని గుండె 103,689 సార్లు కొట్టుకుంటుంది. రక్తం 168,000000 మైళ్ళు ప్రవహిస్తుంది. గోళ్ళు 0.000046 అంగుళం పెరుగుతాయి. వెంట్రుకలు 01713 అంగుళం పెరుగుతాయి. కండరాలు 750 సార్లు కదులుతాయి. మెదడులోని నరాలు 70.00.000 సార్లు చలిస్తాయి.